క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం



చిన్నతుంబళంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగు విధానాన్ని వివరిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం డివిజన్ ఇన్‌చార్జ్ రేవన్న పేర్కొన్నారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో రైతు యల్లప్ప పొలంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్ పంటలను సాగు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం ద్వారా రైతులు 30 రోజుల నుంచే ఆదాయం పొందవచ్చన్నారు. ఈ విధానం ద్వారా నేలలో జీవ వైవిధ్యం పెరిగి సారవంతం అవుతుందన్నారు. ప్రజలకు ఆరోగ్యవంతమైన కూరగాయలను అందించవచ్చన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మండల సిబ్బంది, గ్రామ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



చెత్త నిర్వహణ కేంద్రాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ సుబ్బరాజు అన్నారు. ఆయన మంగళవారం పొదలకుంట గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. కార్యదర్శి శివప్పను అడిగి సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి జగనన్న సురక్షలో నమోదు చేయించాలన్నారు. సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

చెత్త నిర్వహన కేంద్రాల పరిశీలన

మండల పరిధిలోని గోతులదొడ్డి, గుడికంబాలి గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీఓ జుబేర్‌అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌతాళంకు ఎమ్మెల్యే రాక

కౌతాళం: కౌతాళంలో బుధవారం జరిగే సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హాజరవుతున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. మండల స్థాయి అధికారులు తమతమ ప్రగతి నివేదికతో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, గ్రామ నాయకులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం మండల పరిధిలోని బాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వెల్లడించారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



బసవన్న దేవాలయం వద్ద కొలువైన గణనాథుడు

కౌతాళం: వినాయక చవితి వేడుకలు కౌతాళం మండలంలో సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మండల కేంద్రంతో పాటు ఉరుకుంద, ఎరిగేరి, హల్వి, బదినేహాల్, కామవరం, బాపురం, ఉప్పరహాల్, కుంటనహాల్ తదితర అన్ని గ్రామాల్లో గణపయ్యల ప్రతిమలను ప్రతిష్ఠించారు. ఏ వీధిలో చూసిన గణపయ్యలను ప్రతిష్ఠించడంతో పండుగ వాతావరణం నెలకొంది. గణపతి మండపాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కౌతాళంలోని పాతబస్టాండ్, బసవేశ్వర స్వామి దేవాలయం, ప్యాట బసవన దేవాలయం, నగరేశ్వర దేవాలయం వద్ద దశావతారం, పంచాముఖ అవతారం, ఉగ్రనరసింహ రూపం, నాగశేష రూపంలో ఇలా వివిధ రూపల్లో గణపయ్యల విగ్రహాలను ప్రతిష్ఠించారు. నగరేశ్వ దేవాలయం వద్ద పంచముఖ వినాయకుడు, వైఎస్సార్ కార్యాలయం వద్దవినాయకుడు, మెయిన్ రోడ్డులో వెలసిన ఉగ్రనరసింహ, బసవన్న గుడి వద్ద వెలసిన వినాయకుడు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఉరుకుంద దేవాలయం వద్ద రాత్రి పూట పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి యువకులు నృత్యాలు చేశారు. కౌతాళంలోని పలు వినాయక మిత్ర మండలి బృందాల ఆధ్వర్యంలో సాంస్కతిక కార్యాక్రమాలు నిర్వహించారు. మంగళవారం రైతు వినాయక మిత్ర మండలి వారు అన్నదానం చేశారు.





సీఎం జగన్‌కు ఘన స్వాగతం

హంద్రీ – నీవా ద్వారా 77 చెరువులకు నీటిని అందించే పథకాన్ని ప్రారంభించేందుకు మంగళవారం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఉదయం ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎంకు ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న దృశ్యం

గణనాథుడి సేవలో ఎమ్మెల్యే

మంత్రాలయం: వినాయక చవితి పురస్కరించుకుని సోమవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పూజోత్సవంలో పాల్గొన్నారు. రాంపురం గ్రామంలో కొలువుదీరిన వినాయకునికి కుంకుమ, పుష్పార్చనలు చేసి హారతులు పట్టారు. మండల కేంద్రంలోని రాఘవేంద్ర నగర్, రామచంద్ర నగర్, పాతూరులో కొలువుతీరిన గణపయ్యలకు ఆయా వినాయక మండలి సభ్యులు విశేష పూజలు కానిచ్చారు. గ్రామస్తులు పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- రూ.18 కోట్లతో మూడు ప్రభుత్వకార్యాలయాలు, సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి
- ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వంద పడకల భవనం ప్రారంభం



50 పడకల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలో రూ.18 కోట్లతో రెండు ప్రభుత్వ ఆస్పత్రులు, కేడీసీసీ బ్యాంకు, ఏటీఎంతో పాటు మండిగిరి పంచాయతీ పరిధిలో జంగాల వీధిలో సీసీ రోడ్డును ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కేడీసీసీ చైర్మన్ విజయమనోహరి సోమవారం ప్రారంభించారు. ఐసీడీపీ పథకం కింద రూ.50 లక్షలు, ఎన్‌సీడీపీ రూ.35 లక్షలు మొత్తం రూ.85 లక్షలతో కేడీసీసీ బ్యాంకు, ఏటీఎంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం, అధికారులు, ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం జరిగింది. నాడు–నేడు పథకం కింద రూ.7.12 కోట్లతో మాతాశిశు సంరక్షణ కేంద్రంలో 50 పడకల నూతన భవనాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించగా, ప్రారంభించారు. రూ.10 కోట్లతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్మించిన వంద పడకల భవనాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి మండిగిరి పంచాయతీ పరిధిలోని జంగాల కాలనీలో పంచాయతీ నిధులు రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అభివృద్ధి పనులు చేపట్టడం, ఆ వెంటనే ప్రారంభోత్సవాలు చేస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడు అందని ద్రాక్ష – నేడు ఇంటి ముంగిటకే వైద్యం – ఎమ్మెల్యే

నాడు విద్య, వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందని, నేడు జగనన్న పాలనలో ప్రజల ఇంటి ముంగిటకే వైద్యం అందుతోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. భవనాలు శిథిలమై లీకేజీ కావడం, బెడ్లు లేక ఒక్కో మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం చేసే పరిస్థితి ఉండేదన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్య, వైద్యం ప్రతిఒక్కరికీ అందాలన్న ఉద్దేశంతో పెనుమార్పులు తీసుకొచ్చారని వివరించారు. రోగులకు అనుగుణంగా బెడ్లు, మంచాలు, గదులు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని 15 లక్షల మందికి సేవలు అందించే ఏరియా ఆస్పత్రిలో వంద పడకల సౌకర్యంతో నూతన భవనాన్ని నిర్మించామన్నారు. మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని 50 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేశామన్నారు. ఏరియా ఆస్పత్రిలో రూ.13 కోట్లతో మరో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మరో ఏడాదిలో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. ఇక ఎలాంటి జబ్బుకైనా ఆదోనిలోనే చికిత్స పొందవచ్చన్నారు. మాతాశిశు సంరక్షణ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు రెండు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తానని పార్టీ సీనియర్ నాయకుడు కుంకనూరు వీరేష్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, వైద్య విభాగం జిల్లాధ్యక్షుడు క్రిష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎంపీడీఓ గీతావాణి, కేడీసీసీ బ్యాంకు సీఈఓ రామాంజనేయులు, మేనేజర్ షేక్‌మహబూబ్‌బాషా, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

నేడు డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభం



ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో నూతనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలో విద్యార్థులు విద్యను అభ్యసించేవారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం విద్యార్థి సంఘాలు పోరాటాలు చేస్తు వచ్చినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. గతేడాది జూలై మాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదోని పర్యటనకు వచ్చినప్పుడు ప్రజలు, విద్యార్థి సంఘాల కోరిక మేరకు డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ ఏడాది జూన్ మాసంలో కళాశాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలలో బీఏ ఎకనామిక్స్–40, బీకాం జనరల్ –60, బీఎస్సీ బాటనీ–40 సీట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలలో అడ్మిషన్ల కేటాయింపునకు అన్ని వసతులు సమకూర్చే విధంగా రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను కూడా నియమించింది. కళాశాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై అధికారులు స్థానిక ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డితో చర్చించారు. స్పందించిన ఎమ్మెల్యే వైఎంకే పాఠశాల బిల్డింగ్ యజమానులు, ఉన్నతాధికారులతో మాట్లాడి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారు. నేడు వైఎంకే పాఠశాలలో డిగ్రీ కళాశాల తరగతులను ప్రారంభించనున్నారు.

మొదటి బ్యాచ్ తరగతులు ప్రారంభం



ఆదోని పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలలో నేడు మొదటి బ్యాచ్‌కు తరగతులను ప్రారంభిస్తున్నాం. ఆదోని డివిజన్‌లోని పేద మధ్య తరగతి విద్యార్థులకు ఇది మంచి అవకాశం. కళాశాలకు అవసరమైన ఫర్నిచర్‌తో పాటు సబ్జెక్టులకు అవసరమైన భోదన సిబ్బందిని కూడా నియమించేందుకు స్థానిక ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డితో కలసి ఉన్నతాధికురులకు విన్నవించాం. పాటు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శివారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

యార్డుకు భారీగా పత్తి దిగుబడులు



ఆదోని మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం అధిక సంఖ్యలో పత్తి దిగుబడులను రైతులు అమ్మకానికి తెచ్చారు. సరైన సమయంలో వర్షాలు రాకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గత వారంలో వర్షాలు బాగా కురవడంతో పంటలు చేతికి వచ్చాయి. ఈ మేరకు మంగళవారం యార్డుకు 5,425 క్వింటాళ్ల పత్తి దిగుబడులు అమ్మకానికి రాగా, గరిష్ఠ ధర రూ.7,738, మధ్య ధర రూ.7,469, కనిష్ఠ ధర రూ.5,089గా నమోదైంది. అదేవిధంగా వేరుశనగ ధర బాగా పెరిగింది. 469 క్వింటాళ్ల వేరుశనగ దిగుబడులు విక్రయానికిరాగా, గరిష్ఠ ధర రూ.8,445, మధ్యధర రూ.7,388, కనిష్ఠ ధర రూ.4,016, ఆముధాలు 343 క్వింటాళ్లు రాగా, గరిష్ఠ ధర రూ.5,656, మధ్య ధర రూ.5,380, కనిష్ఠ ధర రూ.4 వేలుగా నమోదైంది. ఆదివారం సెలవు, సోమవారం వినాయక చవితి పండుగ సెలవు కావడంతో మంగళవారం భారీగా దిగుబడులు వచ్చాయని వ్యాపారస్తులు, కమిషన్ ఏజెంట్లు చెబుతున్నారు.

ఘనంగా వీరభద్రేశ్వర స్వామి జయంతి



పల్లకీ సేవలో పాల్గొన్న వీరశైవ భక్తులు

ఆదోనిఅర్బన్: వీరభద్రేశ్వరస్వామి జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక సంతపేటలో వెలిసిన పేట వీరభద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మహర్షి విజయ్‌కుమార్ స్వామి, కందువాలి ఈరన్న, శివరుద్రప్ప, ఎర్రిస్వామి, దేవిశెట్టి వీరేష్, టెక్కలకోట వీరేష్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పల్లకీసేవ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

'ఆరోగ్య సురక్ష'పై సమీక్ష



ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదోనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం స్థానిక అరుంజ్యోతి నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సురక్షపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై ప్రజలకు వివరిస్తూ పూర్తి సమాచారాన్ని సేకరించడంతో పాటు ఇంట్లో ఎవరెవరికీ వైద్య సేవలు అవసరమవుతాయో తెలుసుకొని సేవలు అందించే విధంగా చూడాలన్నారు. ఏ ఒక్క ఇల్లు కూడా వదలకుండా పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాధిక, హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు పాల్గొన్నారు.

పన్నుల భారం తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ప్రభాకర్ రెడ్డి

ఆదోనిరూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మెట్రో ఫంక్షన్‌హాల్‌లో జిల్లాస్థాయి విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అక్టోబర్ 22న ఆదోనిలో ప్రారంభం కానున్న రాష్ట్ర బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో నరేంద్రమోదీ రెండోసారి అధికారంలోకి వచ్చాక నిత్యవసర వస్తువుల ధరలు, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెంచారని, అదేవిధంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు మాట ఇచ్చి ఉన్న ఉద్యోలు తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారని విమర్శించారు. ఆదోని పట్టణ, మండల సీపీఎం కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, సీనియర్ నాయకులు ఈరన్న, మహానంది రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్వతాపురం రోడ్డులో చోరీ

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని పర్వతాపురం రోడ్డులో కార్పెంటర్ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దుకాణం యజమాని ఫరూక్ తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి 8 గంటల వరకు దుకాణంలో పని చేసుకుంటున్నామని, తర్వాత తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయామని చెప్పారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా.. దుకాణం రేకును తొలగించి లోనికి చొరబడి సామగ్రిని గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. ప్రభుత్వ పాఠశాలకు వినియోగించే కార్పెంటర్ సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లారని, వాటి విలువ రూ.35 వేలు ఉంటుందని తెలిపారు. ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

అగ్నిప్రమాదంలో పాడిపశువులు సజీవదహనం



ప్రమాదంలో మృతి చెందిన ఎద్దులు

కౌతాళం: మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఎద్దులతో పాటు 45 మేకలు, గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు మల్లయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న సొంత పొలంలో పశువుల కోసం రేకుల షెడ్ వేశాడు. ఈ షెడ్‌లోనే ఎద్దులతో పాటు 45 మేకలను ఉంచేవాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి పశువులకు మేత వేసి దీపం తగిలించి షెడ్‌కు తాళం వేసుకుని రాత్రి 10 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. దీపం నుంచి నిప్పురవ్వలు పడి షెడ్డులోని మేతకు అంటుకోవడంతో మంటలు వ్యాపించి రెండు ఎద్దులతో పాటు 45 మేకలు సజీవ దహనమయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున షెడ్డు వద్దకు వెళ్లి చూడగా పశువులన్నీ మృత్యువాత పడ్డాయి. అగ్ని ప్రమాదంలో రూ.5 లక్షల వరకు నష్టం కలిగిందని మల్లయ్య వాపోయాడు. రెండు నెలల క్రితం మల్లయ్య తండ్రి వెంకటేష్ ఇదే షెడ్డులో పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన మరువక ముందే మళ్లీ షెడ్డుకు అగ్నిప్రమాదం సంభవించి మూగ జీవాలన్నీ మృత్యువాత పడడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

పోక్సో కేసు నమోదు

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన 14 యేళ్ల మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన బోయ గోవిందు అనే వ్యక్తి మాయమాటలు చెప్పి శారీరకంగా లొంగదీసుకుని గర్భవతిని చేశాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య మంగళవారం విలేకరులకు తెలిపారు. బోయ గోవిందుకు పెళ్లి అయ్యి ఇద్దరు పిల్లలు ఉన్నారని, మైనర్ బాలికను మభ్యపెట్టి గర్భవతిని చేశాడన్నారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వ్యక్తిపై కేసు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని రాయనగర్‌కు చెందిన నాగరాజు ఓ యువతికి మాయమాటలు చెప్పి మోసగించారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమసింహ మంగళవారం తెలిపారు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి తీరా పెళ్లి చేసుకోమంటే పట్టించుకోవడం లేదని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం మోపండి



ఆదోని సెబ్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీసీ నాగమద్దయ్య

ఆదోనిరూరల్: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంపై ఉక్కుపాదం మోపాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా హెడ్‌క్వార్టర్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఏపీ కమిషనర్ రవిప్రకాష్ ఆదేశాల మేరకు.. ఆదోని మండలంలోని పెద్దహరివాణం గ్రామం వద్ద ఉన్న కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆదోని సెబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బార్డర్ నుంచి కర్ణాటక మద్యం ఎక్కువగా వస్తున్నట్లు కమిషనర్ దృష్టికి వచ్చిందని, ఈ మేరకు దాడులను ముమ్మరం చేయాలని చెక్‌పోస్టు అధికారులు, సెబ్ అధికారులను ఆదేశించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సెబ్ సీఐలు హరికృష్ణ, చెక్‌పోస్టు సీఐ మంజుల, సెబ్ ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు



మంటల్లో కాలిపోయిన ద్విచక్ర వాహనం

పెద్దకడబూరు: ద్విచక్ర వాహనానికి ఉద్దేశపూర్వంగానే నిప్పు పెట్టిన సంఘటన మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోటుచేసుకుంది. బాధితుడు రాజాహ్మద్ తెలిపిన వివరాల మేరకు.. రోజూ మాదిరిగానే స్కూటర్‌ను ఇంటి ముందు నిలిపి ఉంచారు. అర్ధరాత్రి తరువాత 1 గంట సమయంలో బైకుకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టి వెళ్లిపోయారు. మంటలను గమనించిన స్థానికులు బాధితుని ఇంటి తలుపులు కొట్టి బయటకు పిలిచారు. అందరూ మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించగా బైక్ అప్పటికే పూర్తిగా కాలిపోయింది. ఎవరో ఉద్దేశపూర్వకంగానే తన వాహనానికి నిప్పు పెట్టారాని బాధితుడు వాపోయారు. రెండు సంవత్సరాల క్రితం కొన్న బండి ఇన్సూరెన్స్ కూడా కట్టలేదని తనకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఆశ్రయించాడు. స్పందించిన ఎస్ఐ మహేష్‌కుమార్ విచారణ చేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.


ఎస్సీ వర్గీకరణను సాధించుకుందాం



ఎంఆర్‌పీఎస్ దీక్షకు మద్దతు తెలుపుతున్న దివ్యాంగుల సంఘం నాయకులు

కోసిగి: ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎంఎస్‌ఎఫ్ జిల్లా కో–కన్వీనర్ దుర్గప్ప మాదిగ అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు మద్దతుగా కోసిగిలో ఆ సంఘం మండలాధ్యక్షుడు చింతకుంట సామేల్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు కొనసాగించారు. దీక్షలకు దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు ఆరేకంటి తాయన్న, ముద్దమ్మ గారి హనుమంతు, పూడూరు హనుమంతు, యోహాన్, గడ్డం ఈరన్న, కోసిగయ్య, ఉలిగయ్య, కుమ్మరి అయ్యన్నలు మద్దతు తెలిపి దీక్ష బూనారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేసి వెనబడిన ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ కో–కన్వీనర్ ఈరన్న, ప్రకాష్, నాయకులు శివ, రామకృష్ణ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు చిదానంద తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదముద్ర వేయాలని ఆదోని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశల మేరకు ఆదోని ఎమ్మార్పీఎస్ పట్టణాధ్యక్షులు గుమ్మల బాలస్వామి మాదిగ అధ్యక్షతన నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఎంఎస్‌పీ మండల నాయకులు బైచిగేరి తిమ్మన్న, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు సప్పాగు రామంజి, మండల నాయకులు కంగారి సుధాకర్, టౌన్ నాయకులు వడ్డేమాన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



హవన్నపేటలో రావణాసురుడి తలపై పంచముఖ వినాయకుడు



ఎల్‌బీ స్ట్రీట్‌లో వేంకటేశ్వర స్వామి రూపంలో వినాయకుడు



ఎంఐజీ కాలనీలో వినాయకుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

వినాయకా నమోస్తుతే



వడ్డేగేరిలో సిద్ధిబుద్ధితో వినాయకుడు, పైన పంచముఖ పరమేశ్వరుడు

ఆదోనిఅర్బన్: వినాయకచవితి సందర్భంగా పట్టణంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రథమ పూజ్యుడు విఘ్నాలను తొలగించే వినాయకుడికి చవితిరోజున మండప నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద విద్యుత్ దీపాలంకరణతో స్వామివారికి కావాల్సిన పూజా సామగ్రిలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంతేగాకుండా ఎక్కువశాతం పట్టణంలో విష్ణు రూపంలోనే వినాయకుడు భక్తులకు దర్శనభాగ్యం ఇచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం ప్రత్యేక అలంకరణలో భక్తులకు నిర్వాహకులు దర్శనభాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు.